


# కరపత్రం

SINCE 2014

ఆదివారం జూలై 13 2025 సంపుటి :0 సంచిక :268 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4






## న్యాయవాద వృత్తి

# ఎన్నో సవాళ్లతో కూడుకున్నది

» చేసే వృత్తిని, చేసే పనిని ప్రేమించగలగాలి
» కోర్టు తీర్పులపై సమగ్ర అవగాహనతో ఉండాలి
» న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఇదే ఛాన్స్
» నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్

హైదరాబాద్,జూలై12 :
న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. వృత్తిని, చేసే పనిని ప్రేమించాలి. అప్పుడే సరైన ఫలితాలు పొందగలుగుతాం. ప్రస్తుతం న్యాయవ్యవస్థలో ఎన్నో సవాళ్లు ఉన్నాయి. కొన్ని కేసుల విచారణ దశాబ్దాల పాటు సాగటం ఆందోళనకరం అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ-లో 22వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి జస్టిస్ బీఆర్ గవాయ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ, హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్‌పాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ..న్యాయవాదులు నిరంతరం తమను తాము నిరూపించుకోవాల్సి ఉందన్నారు. కోర్టు తీర్పులకు సంబంధించి సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం న్యాయవాద విద్యలో ప్రవేశించే వారి సంఖ్య పెరుగుతోంది. ఏఐ, డేటా ప్రైవసీ విషయంలో అనుకూల, ప్రతికూల ప్రయోజనాలు ఉన్నాయి. సరైన మార్గదర్శకత్వం ఉంటేనే.. నైపుణ్యం సాధించగలమన్నారు.మెంటార్‌షిప్‌ను ఒక బాధ్యతగా భావించాలన్నారు.

మిగతాది 2లో

## మావోలకు భారీ ఎదురుదెబ్బ

## 23మంది మావోల లొంగుబాటు



2 లో

రాయపూర్,జూలై12
ఛత్తీస్‌గఢ్‌లో వరుస లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. భారీగా మావోలు లొంగిపోయారు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట శనివారం 23 మంది మావోయిస్టులు లొంగిపోయారు. శుక్రవారం నారాయణపూర్ జిల్లాలో ఎస్పీ రాబిన్‌సన్ ఎదుట 22 మంది మావోయిస్టులు లొంగిపోయిన విషయం తెలిసిందే. సుక్మా జిల్లాలో లొంగిపోయిన 23 మందిపై రూ.1.18 కోట్ల రివార్డ్ ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. లొంగిపోయిన వారిలో 9మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు.

# రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు

» వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన
» మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



నల్లగొండ,జులై 12:
తెలంగాణలో రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. శనివారం నల్లగొండలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణలో 17 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాప్‌కి వెళ్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. రాష్ట్రం వాహన సారథిలోకి ఎంట్రీ- అయిందని చెప్పారు. వాహనాల ఫిట్‌నెస్, పొల్యూషన్ అన్నీ వాహన సారథిలో చూసుకోవచ్చని తెలిపారు. ఏఐ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చేలా చేస్తున్నామని అన్నారు. యాక్సిడెంట్‌లు చేస్తే లైసెన్స్‌లు వెంటనే రద్దు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆటోమేటిక్ -టె-స్టింగ్ స్టేషన్, స్క్రాప్ పాలసీ, ఈవీ పాలసీ తీసుకువచ్చామని నొక్కిచెప్పారు. డ్రైవింగ్ -ట్రైనింగ్ సెంటర్లు వస్తున్నాయని...అక్కడ -ట్రైనింగ్ తీసుకున్న తర్వాతనే లైసెన్స్‌లు వస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నల్గొండ జిల్లాలో రూ.8 కోట్లతో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇది తెలంగాణలోనే రెండవ ఆ÷ూ సెంటర్ అని ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో పొన్నం ప్రభాకర్ కేబినెట్‌లో కొట్లాడారని గుర్తుచేశారు. నిజాం కాలంలో మొదటి డిపో నార్కెట్‌పల్లి అని ఇప్పుడు 60 బస్సులు ఉన్నాయని.. ఇంకో 20 బస్సులు కావాలని సూచించారు. నల్లగొండ డిపోను నూతనంగా నిర్మించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

» కాంగ్రెస్ ప్రభుత్వ చారిత్రక నిర్ణయాలు
» వీటిని అభినందించలేకపోతున్న బిఆర్ఎస్
» పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్,జూలై12:
కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కీలకమైన ఈ నిర్ణయాలను అభినందించేందుకు కూడా భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌కు మనసు రావడం లేదని విమర్శించారు.

2 లో



మిగతాది 2లో

## కాంగ్రెస్ తోనే రాష్ట్రాభివృద్ధి.. బీసీ రిజర్వేషన్లు ఘనత మాదే : కోమటిరెడ్డి

పేదల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి. బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత తమదేనన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు అండగా ఉండాలని కోరారు.



## కాంగ్రెస్ హయాంలోనే టూరిజం డెవ్‌లప్ మెంట్ : మంత్రి వివేక్ వెంకటస్వామి

కాంగ్రెస్ హయాంలోనే టూరిజం డెవ్ లప్ మెంట్ జరుగుతోందన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు మంత్రి వివేక్, కొండా సురేఖ, ఈ సందర్భంగా మాట్లాడిన వివేక్.. కాంగ్రెస్ టెంపుల్ టూరిజాన్ని అభివృధి చేస్తోందన్నారు. పిల్లలు ఉన్నత విద్యావంతులు కావాలని తల్లిదండ్రులు సరస్వతీ అమ్మవారికి పూజలు నిర్వహిస్తారని చెప్పారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రచారార్భాటం

▪ స్కూటీలు, పెళ్లికి లక్ష నగదు, తులం బంగారం ఏవీ
▪ ప్రభుత్వంపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవత విమర్శలు



రంగారెడ్డి,జూలై12 :
ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు.ఎన్నికల ముందు అమ్మాయిలకు స్కూటీలు, పెళ్లికి లక్ష రూపాయల నగదు, తులం బంగారం ఇస్తామని చేసిన హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

02

## ఆదాయం వచ్చే పంటలపై దృష్టి సారించాలి

### - మంత్రి తుమ్మల



కొణిజర్ల:
ఆదాయం వచ్చే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురంలో నిర్వహించిన 'మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్' ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఆయిల్ పామ్ సాగు విషయంలో రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ నాటికి పామాయిల్ ఫ్యాక్టరీని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రారంభించాలని, ఆ దిశగా పనులు పూర్తి చేయాలన్నారు. రిఫైనరీ పనులు కూడా స్థానికంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.పామాయిల్ సీడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారాలు అందిస్తామని మంత్రి తుమ్మల చెప్పారు. భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా వక్క మొక్కలు నాటామని తెలిపారు. మే నెలలో కురిసిన వర్షాలతో పంటసాగు ప్రారంభించిన రైతులకు ఇబ్బంది కలగకుండా సీతారామ ఎత్తిపోతల పథకం నుంచి జలాలను నాగార్జున సాగర్ ఆయకట్టుకు నేడు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై కావాలనే దుష్ప్రచారం

## మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు



సిద్దిపేట,జులై 12:
కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే కాళేశ్వరం నుంచి నీళ్లు ఆపుతున్నారని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కావాలనే పదేపదే కాళేశ్వరం కూలిపోయిందని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం నీటిని ఉపయోగించకుండా పక్కన పెట్టారని అన్నారు. సిద్దిపేటలో 167 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. వర్షాలకు గోదావరిలో 8 లక్షల క్యూసెక్కులు వృథాగా పోతున్నాయి. మోటార్లు ఆన్ చేయకుండా రాజకీయాలు చేస్తున్నారు. మోటార్లు ఆన్ చేస్తే వారం రోజుల్లో రంగనాయకసాగర్ నిండిపోతుంది.

2 లో

# సంపాదకీయం

## ఘోరం... ఇది దారుణం!



'గర్భ' గుడిలో జీవం పోసుకోవటంతో మొదలై కడదాకా అడుగడుగునా వివక్ష ఎదుర్కొంటున్న ఆడపిల్లకు మృత్యువు తరచు తారసపడుతుంటుంది. అది పుట్టినిల్లా, మెట్టినిల్లా, నడివీధా, జనసమ్మర్ధం లేని ప్రాంతమా అనే తారతమ్యం లేదు. హంతకులు ఏ రూపంలో వుంటారో, ఎక్కడ కాపుగాస్తారో తెలియదు. తండ్రా, సోదరుడా, కట్టుకున్నవాడా, అపరిచితుడా అనే తేడా కూడా లేదు. ఉసురు తీసేవాడు ఎవడైనా కావొచ్చు. కారణం ఏదైనా ఉండొచ్చు. హరియాణాలోని గురుగ్రామ్‌లో కన్నతండ్రే కాలయముడై నిష్కారణంగా తన కంటిపాపను చిదిమేసిన ఈ ఉదంతం దిగ్భ్రాంతికరమైనది. తండ్రి దీపక్ యాదవ్ తుపాకి గుళ్లకు బలైపోయిన టెన్నిస్ క్రీడాకారిణి రాధికా యాదవ్ చేసిన 'నేరం' ఏమీ లేదు. చిన్న వయసులోనే ఆ క్రీడలో రాణించి, ప్రతిభా పాటవాలు సొంతం చేసుకుని, అంచెలంచెలుగా ఎదగటమే ఆమె నేరం. కేవలం ఇరవై అయిదేళ్లకే రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ సర్క్యూట్‌లో ఆమె ర్యాంకు 113. ఆ విధంగా అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా కూడా నిరూపించుకుంది. సొంతంగా టెన్నిస్ అకాడెమీ నెలకొల్పింది. తన వంటి బాలికలకు శిక్షణనిస్తున్నది. వారు ఎదగటానికి ఆసరాగా నిలు స్తున్నది. అటువంటి రాధిక, కన్నతండ్రికి కంట్లో నలుసుగా మారిందంటే నమ్మగలమా? ఆమెను కాల్చిచంపటం తప్ప మరో దారిలేదని విశ్వసించాడంటే ఊహించగలమా? యువతరంలో చాలా మందికి ఆ వయసుకల్లా ఏం ఎంచుకోవాలో, ఎటుపోవాలో తెలియని అయోమయం ఆవరిస్తుంది. సంకోచం వెనక్కు లాగుతుంది. కింకర్తవ్య విమూఢత కాటేస్తుంది. ఆశించిన ఉద్యోగం అందక, ఇష్టంలేని కొలువుతో సరిపడక నిస్పృహలో కూరుకుపోతారు. కానీ రాధిక అలా కాదు. టెన్నిస్ రంగంలో ఎదిగి ఒక సానియా మీర్జాలా, ఒక సెరెనా విలియమ్స్‌లా మెరిసిపోవాలనుకుంది. ఇప్ప టికే రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి ఎన్నో అవార్డులూ, రివార్డులూ సాధించింది. జాతీయ స్థాయి టెన్ని స్‌లో సైతం స్థానం సంపాదించుకోవాలని తపన పడుతోంది. కన్నవారికే కాదు... దేశానికే పేరు ప్రఖ్యాతులు తీసుకురాగలదన్న భరోసానిచ్చింది. ఇవన్నీ ఆమె తండ్రి దృష్టిలో నేరాలయ్యాయి. రాధికా యాదవ్ ఉదంతం మనందరం నమ్ముతున్న విలువల్ని ప్రశ్నార్థకం చేస్తోంది. చిన్ననాటి నుంచీ టెన్నిస్‌లో ఆమెను వెన్నుతట్టి ప్రోత్సహించినవాడే హఠాత్తుగా ఎలా హంతకుడయ్యాడు? మెచ్చిన నోటితోనే దుర్భాషలాడే స్థితికి అతగాడు చేరటం వెనకున్న పరిణామాలెలాంటివి? పోలీ సులకిచ్చిన వాంగ్మూలంలో అతను ప్రస్తావించిన అంశాలు వింటే ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్న మన సమాజం నిజస్వరూపం బట్టబయలవుతుంది. అంతా సవ్యంగా వుందని ఆత్మవంచనతో బతికేవారిని నిలదీస్తుంది.అందరూ దీపక్‌లాగే స్పందించక పోవచ్చుగానీ ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రుల్లో చాలామందికి కన్నకూతురు గురించి నలుగురూ నాలుగు రకాలుగా మాట్లాడటం, ఆమెను చిన్నచూపు చూడటం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం కనబడుతూనే వుంటుంది. ఇలాంటి దుర్మార్గ ధోరణులను ప్రతిఘటించాల్సిన దీపక్ యాదవ్ తానూ ఆ తానులో ముక్కయ్యాడు. వారు ప్రవచిస్తున్న విలువల పరిధిలో, పరిమితిలో వుండకుండా కుటుంబాన్ని రాధిక వీధిన పడేస్తున్నదని అపోహపడ్డాడు. టెన్నిస్ క్రీడ గురించీ, తానిస్తున్న శిక్షణలో పాటించే ప్రమాణాల గురించీ ఆమె చేసిన వీడియోపై వచ్చిన కామెంట్లు తట్టుకోలేక సోషల్ మీడియా ఖాతాను అప్పటికే తీయించేశాడు. అకాడెమీని సైతం మూసేయాలన్న సలహా కూడా పాటించాలని కోరుకున్నాడు. దాన్ని తిర స్కరించిందన్న ఉన్మాదంతో మానవత్వాన్ని మరిచాడు. కూతురి సంపాదనపై బతుకుతున్నావని ఛీత్కరించిన మృగాల్లో కనీసం ఒక్కరికి తన లైసెన్స్ రివాల్వర్‌ను గురిపెట్టివుంటే ఆ బాపతు నోళ్లు మూతబడేవి. స్వయంశక్తితో ఎదుగుతున్న కన్నకూతురి కోసం దృఢంగా నిలబడిన ఒక మంచి నాన్నగా నిలిచేవాడు. ఏమైంది ఇవాళ? యుక్తాయుక్త విచక్షణ కోల్పోయి హంతకుడిగా మిగిలాడు! ఆడపిల్లను పెంచటం, ఆమె అభీష్టానికి అనుగుణంగా ఎదగనివ్వటం, ఇష్టపడిన చదువు చది వించటం, కోరుకున్న వాడికిచ్చి పెళ్లిచేయటం వర్తమానంలో పెను సవాలుగా మారిందన్నది వాస్తవం. తల్లిదండ్రులు విద్యావంతులైనా, ఉన్నతోద్యోగాలు చేస్తున్నా, సమాజం పెట్టిన ప్రమాణా లను ఆడపిల్ల మీరితే ఎలా అన్న విచికిత్సలో పడుతున్నవారు చాలామందే తారసపడతారు. వారిలో అనేకులు చుట్టూవున్నవారి ఒత్తిళ్లకు లొంగి ఇంటి ఆడపిల్లను అదుపు చేయటానికి ప్రయ త్నించేవారే.ఆ క్రమంలో అనేకమంది పిల్లలు తమ ఇష్టాలను వదులుకుని బతుకులు వెళ్లదీస్తు న్నారు. అసలు బయటికెళ్లిన ఆడపిల్ల సురక్షితంగా ఇంటికొస్తుందో లేదో తెలియని ఆందోళనతో నిత్యం భయంభయంగా బతుకుతున్న తల్లిదండ్రులకు మేమున్నామంటూ భరోసానిచ్చే వ్యవస్థలు న్నాయా? సామాజిక కట్టుబాట్ల పేరుతో రూపొందుతున్న తప్పుడు విలువలు ఇళ్లల్లోకి చొరబడకుండా, వాటి దుష్ప్రభావాలు కుటుంబాలపై పడకుండా నివారించే సంస్కృతి ఆచూకీ ఏది? మన ప్రభుత్వాలు తీసుకుంటున్న కనీస చర్యలేమిటి?ఆడవాళ్లను కించపరిచే సినిమాలనూ, ఇతరేతర మాధ్యమాలనూ ఏ మేరకు కట్టడి చేయగలుగుతున్నాం? ఎటువంటి వివక్షకూ తావు లేకుండా దేశ పౌరులందరికీ సమాన అవకాశాలు లభించాలన్న మన రాజ్యాంగం సక్రమంగా అమలవు తున్నదా? ఇవన్నీ సరిగా లేనప్పుడు దీపక్‌లాంటివారు రూపొందుతారు. వారికి నారూ నీరూ పోస్తున్నవారు ఎప్పటికీ పదిలంగా వుంటారు. రాధికా యాదవ్ వంటి మణిపూసలు నిస్సహాయంగా నేల రాలుతారు.

## న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నది

మొదటిపేజీ తరువాయి

జస్టిస్ గవాయ్ తన ప్రసంగంలో యువ న్యాయవాదులకు, న్యాయ రంగ ప్రవేశిస్తున్న విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. నేటి ప్రపంచంలో న్యాయవ్యవస్థ ముందున్న సవాళ్లను గుర్తు చేసిన ఆయన, మన దేశం వివిధ లీగల్ ఛాలెంజెస్‌ను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో, న్యాయవాదులు, న్యాయ సేవలో ఉన్న వారు 'ఎవరేం చెబుతున్నారు' అనే విషయాన్ని క్షుణ్ణంగా వినడం చాలా ముఖ్యం అన్నారు. న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించే సమయం ఆసన్నమైంది. సరైన పద్ధతిలో దాన్ని వినియోగించుకుంటే, ఇది తీర్పులను వేగంగా ఇవ్వడంలో దోహదపడుతుందని సీజేఐ పేర్కొన్నారు. విద్యార్థులు, వారి కుటుంబాలు విదేశీ డిగ్రీల కోసం ఆర్థికంగా భారమవ్వకూడదని హెచ్చరించిన ఆయన, మన దేశంలోనే నాణ్యమైన న్యాయ విద్య ఉంది. విదేశీ డిగ్రీల వల్ల మన టాలెంట్ పెరుగుతుందనుకోవడం తప్పు. మన టాలెంట్ మన పనితనంతో నిరూపించుకోవాలి. ఫారిన్ డిగ్రీల కోసమే కుటుంబాలను అప్పుల పాలుచేయడం అవసరం లేదని చెప్పారు. మనం ఏ పని చేస్తున్నా, అది ఎంత మనసు పెట్టి చేస్తున్నాం అనేది ముఖ్యం. న్యాయ రంగంలో విశ్వాసం, నిబద్ధత, , ప్రజల సేవకే ముఖ్య ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన యువ న్యాయవాదులకు సందేశమిచ్చారు. ఈ స్నాతకోత్సవం సందర్భంగా డిగ్రీలు అందుకున్న విద్యార్థులు, వారి కుటుంబాల్లో ఉత్సాహం కనిపించింది. ముఖ్య అతిథుల ప్రసంగాలు యువతలో ఆశాభావాన్ని పెంపొందించాయి. నల్సార్ యూనివర్సిటీ- తన స్థాయిని నిరూపించుకుంటూ న్యాయవిద్యా రంగంలో దేశానికి ప్రతిభావంతులైన న్యాయవాదులను అందించడంలో ముందుండుతుందని చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రచారార్భాటం

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను టార్గెట్ చేసిన ఆమె, ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తరచూ వెళ్లే వ్యక్తిగా, రాష్ట్రానికి తక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ-లు మొత్తం కాంగ్రెస్ కార్యకర్తలతోనే నిండి ఉన్నాయని ఆరోపించిన కవిత, సీఎం సొంత జిల్లా అయిన మహబూబ్ నగర్‌లో అంబులెన్సులకు డీజిల్ లేక అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు.

రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో 50 శాతం వరకు నాణ్యతలేని దొడ్డుబియ్యమే ఉండటం దారుణమని వ్యాఖ్యానించిన ఆమె, దీనిని ఆధారాలతో నిరూపిస్తామని చెప్పారు. మరోవైపు ఉచిత బస్సు ప్రయాణాల పేరుతో గ్రామాలకు వెళ్లే బస్సులను తక్కువ చేశారని, ఫ్రీ పథకాలు అందిస్తామనే చెప్పి సేవలు కట్ చేసిన దారుణ పాలన ఇది అని విమర్శించారు. ఇప్పటికే ఈ ప్రభుత్వం రెండు లక్షల కోట్ల రూపాయల అప్పు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని కూడా ఆమె ఆరోపించారు. ఇది పనిచేసే ప్రభుత్వం కాదు... ప్రజలే వెంటే ఉండి పని చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని హేళన చేసిన కవిత, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ హయాంలోనే టూరిజం డెవ్‌లప్ మెంట్ : మంత్రి వివేక్ వెంకటస్వామి

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ సర్కార్ కూడ విద్యకు ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. గోదావరి పుష్కరాలకు బీజేపీ ఎంపీ ఎక్కువ నిధులు తీసుకురావాలని సూచించారు.

త్వరలోనే కనీస వేతనాలు పెంచుతామన్నారు వివేక్. ఇది కార్మికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. త్వరలో గిగ్ పాలసీ తీసుకొస్తామని..ఈ పాలసీ వర్కర్లకు భద్రతనిస్తుందన్నారు. ప్రభుత్వానికి అప్పులు భారంగా మారినా.. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు వివేక్. పేదలకు సన్నబియ్యం ఇస్తున్నామని తెలిపారు.మంత్రి వివేక్ వెంకటస్వామి కొండాసురేఖ కలిసి బాసరలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. బాసర ఆలలయ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. రూ. 9 కోట్ల రూపాయలతో మరమ్మత్తులు చేపట్టిన 100 పడకల వసతి గృహం, రూ. 3.47 కోతో నూతనంగా నిర్మించిన బాసర ఆలయ అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ప్రారంభించారు మంత్రులు.

## కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. విపక్షాల తీరుపై విమర్శలు గుప్పించారు. గతంలో ఎన్నో బిల్లుల విషయంలో భారత రాష్ట్ర సమితి.. భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చింది. బీసీలకు మేలు జరిగే నిర్ణయంపై మాత్రం కేసీఆర్ నోరు విప్పడం లేదు. కడుపునిండా విషం పెట్టుకొని కౌగిలించుకొన్నట్లుగా విపక్షాల ధోరణి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై ఏనాడూ దృష్టి పెట్టలేదు. మేం సాధించిన రిజర్వేషన్ల పెంపును.. కవిత తన విజయంగా చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. బీసీ రిజర్వేషన్ల పెంపు పక్రియను మేము చేపట్టినప్పుడు కవిత జైలులో ఉన్నారు. తిహాడ్ జైలులో ఉన్న కవిత బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎప్పుడు పోరాటం చేశారో చెప్పాలి. ఆమె మాటలు విని తెలంగాణ సమాజం నవ్వుకుంటోంది. కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ఆమెకైనా స్పష్టత ఉందా? అని ఎద్దేవా చేశారు. ఇదిలావుంటే మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా ఎందుకు మార్చారో భారత రాష్ట్ర సమితి నేతలు చెప్పాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చర్చకు రాకుండా సీఎం రేవంత్‌రెడ్డిని ఎందుకు దూషిస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో అర్థవంతమైన చర్చ జరగాలని ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు. నీటిపారుదల శాఖ గురించి తాము మాట్లాడుతుంటే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

## మావోలకు భారీ ఎదురుదెబ్బ 23మంది మావోల లొంగుబాటు

మొదటిపేజీ తరువాయి

లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం గృహాలను నిర్మిస్తుందని ఆ రాష్ట్ర హోంమంత్రి విజయ శర్మ ప్రకటించారు. నక్సలిజం.. చాలామందిని వారి కుటు-ంబాలకు దూరం చేయడమే కాకుండా తండ్రి అయ్యే ఆనందం కూడా కోల్పోయేలా చేస్తుందని హోంమంత్రి ఆక్షేపించారు. ఉద్యమంలో ఉండి స్టెరిలైజేషన్ చేయించుకున్న వారు జనజీవన స్రవంతిలోకి వస్తే.. ఐవీఎఫ్ ద్వారా తల్లిదండ్రులు అయ్యే అవకాశం కల్పిస్తామన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉంటు-న్న యువతి, యువకులకు అవసరమైతే సామూహిక వివాహాలు జరిపిస్తామని మంత్రి వెల్లడించారు. సుక్మా జిల్లా మాజీ కలెక్టర్ అలెక్స్ పాల్ మీనన్‌ను కిడ్నాప్ చేసిన ఘటనలో కీలక పాత్ర వహించిన మావోయిస్టు నేత లోకేష్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నారు.

## కాంగ్రెస్ తోనే రాష్ట్రాభివృద్ధి.. బీసీ రిజర్వేషన్లు ఘనత మాదే : కోమటిరెడ్డి

మొదటిపేజీ తరువాయి

నల్లగొండ జిల్లా దండంపల్లి లో రూ. 8 కోట్ల వ్యయంతో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు మంత్రులు పొన్నం ప్రభాకర్,కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రవాణా శాఖ నుంచి ఏ అవసరమున్న నల్గొండ జిల్లాకు అధిక నిధులు ఇవ్వాలన్నారు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.ఉచిత బస్సు వల్ల ప్రతి ఒక్కరు హైదరాబాద్ వెళ్తుండటంతో బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని చెప్పారు. రూ.6 వేల కోట్లు ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో పొన్నం ప్రభాకర్ కేబినెట్ లో కొట్లాడరని చెప్పారు. బీసీ రిజర్వేషన్ కాంగ్రెస్ చారిత్రాత్మక నిర్ణయమని చెప్పారు.

## కాళేశ్వరంపై కావాలనే దుష్ప్రచారం

మొదటిపేజీ తరువాయి

మేడిగడ్డ కూలితే మోటార్లు, లారీలు ఎలా నడుస్తున్నాయని అన్నారు. రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లు కాళేశ్వరంలో భాగం కావా? ఇవేమీ చూడకుండా కాళేశ్వరం కూలిపోయిందని అసత్య ప్రచారం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చపెడితే.. మీరేం చేశారో.. మేమేం చేశామో మాట్లాడుకుందాం అన్నారు. కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే కాళేశ్వరం నుంచి నీళ్లు ఆపుతున్నారు. రెండు పిల్లర్లకు మరమ్మతులు చేస్తే ఆరు నెలల్లో నీళ్లు ఇవ్వొచ్చు. మేం ప్రశ్నించడంతోనే కల్వకుర్తి మోటార్లు ఆన్ చేశారు. నాట్లకు నాట్లకు మధ్య కేసీఆర్ రైతుబంధు ఇచ్చారు. ఓట్లకు ఓట్లకు మధ్య మీరు రైతుభరోసా ఇస్తున్నారు. రైతుభరోసాను ఎలా కోత పెడదామనే చూస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు

## రప్పా రప్పా నరుకాతననడం కాదు

- కనుసైగలతోనే పని అయిపోయావాల్సందే
- మాజీమంత్రి పేర్ని నాని వ్యాఖ్యల దుమారం
- కృష్ణా జిల్లా అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో కేసు

రప్పా రప్పా అని నరుకుతామని అరవడం కాదని, కనుసైగతోనే పని అయి పోవాలంటూ వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. కృష్ణాజిల్లాలో వైకాపా కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మనం అధికారంలోకి వచ్చాక.. ఇప్పుడు తప్పులు చేసిన వాళ్లను నరికేద్దామంటూ కార్యకర్తల్ని రెచ్చగొట్టారు. కూటమి నేతలు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటామంటూ పరోక్షంగా హెచ్చరించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి పేర్ని నానిపై కృష్ణా జిల్లా అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాల్లో జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశాల్లో రప్పా రప్పా అనటం కాదు చేసి చూపించండి.. అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. పేర్ని నాని వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ టీ-డీపీ రాష్ట్ర నేత కనపర్తి శ్రీనివాసరావు.. అవనిగడ్డ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ బియ్యం దొంగ పేర్ని నాని.. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. మరోవైపు పేర్ని నాని వ్యాఖ్యలపై అవనిగడ్డ నియోజకవర్గ టీ-డీపీ, జనసేన పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో నిర్వహించిన బాబు ష్యూరిటీ- మోసం కార్యక్రమాల్లో మాజీ మంత్రి పేర్ని నాని షןస ןస కశ) వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'లోకేష్ రెడ్ బుక్ అంటే.. మీరు రప్పా రప్పా అంటు-న్నారు.. ఏదైనా చేయాలంటే చీకట్లో కన్నుకొడితే అయిపోవాలే తప్ప.. రప్పా రప్పా అని అనటం కాదు.. అంటూ కార్యకర్తలకు సూచించారు. ఈ వ్యాఖ్యలు వైరల్ కావడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఎపిలో ప్రాథమిక హక్కులకు భంగం అణచివేత చర్యలపై జగన్ ఆగ్రహం

ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకుని, సమాధానం నుంచి కోరుకునే అవకాశం ఉండాలని మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఎపిలో ప్రజాస్వామ్య ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందని అన్నారు. ఎపిలో జరుగుతున్న అణచివేతలపై జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రశ్నించే గొంతులను నులిమేస్తున్నారంటూ జగన్ ట్వీట్ చేశారు. ఎపి సిఎం చంద్రబాబు నాయుడు నిరంకుశ పాలనలో అడ్డగోలుగా అణచివేయపడుతోందని, పోలీసులతో అధికార దుర్వినియోగం చేయిస్తూ, అసమ్మతి గళాలను నులిమేస్తున్నారని మండిపడ్డారు. గుంటూరు మిర్చియార్డులో.. పొదిలిలో పొగాకు రైతులను పరామర్శించేందుకు వెళ్తే మూడు కేసులు పెట్టి 15 మందిని అరెస్టు చేశారని, పల్నాడులో పోలీస్ వేధింపులకు ఆత్మహత్య చేసుకున్నఎమ్మెల్యే నాగమల్లేశ్వరరావు కుటు-ంబాన్ని పరామర్శించడానికి వెళ్తే 5 కేసులు 131 మందికి నోటీ-సులు జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా పోస్టర్ ప్రదర్శించిన యువకుడిని జైల్లో పెట్టారని, బంగారుపాళ్యంలో మామిడి రైతులను పరామర్శించడానికి వెళ్తే ఇష్టం వచ్చినట్టు-గా వైఎస్ఆర్ సిపి కేడర్ ను అక్రమంగా ఇరికిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాన్ని బెదిరించి, అణచివేయాలని చూస్తోందని, ఇందుకోసం పోలీసు వ్యవస్థను వాడుకోవటం సరికాదు అని జగన్ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు.

## వెండి బంగారు వర్తక సంఘం ఎన్నికలు, కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెట్ పల్లి**
మెట్ పల్లి పట్టణంలో శనివారం వెండి బంగారు వర్తక సంఘం నూతన అధ్యక్ష, కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణకారులకు వృత్తిపరంగా ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తేవాలని పరిష్కారానికి తప్పకుండా తన వంతు కృషి చేస్తానన్నారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసిన సీఎం రేవంత్



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి,మేడ్చల్**
తెలంగాణకు విచ్చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ సీఎం రేవంత్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు.శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా, 22వ స్నాతకోత్సవంలో పాల్గొనడానికి జస్టిస్ గవాయ్ హైదరాబాద్ వచ్చారు.ఈ సందర్భంగా యూనివర్సిటీలో ముఖ్యమంత్రి మర్యాద పూర్వకంగా జస్టిస్ గవాయ్ తో సమావేశమయ్యారు.

## ఆర్మూర్ లో బిజెపి కాంగ్రెస్ మధ్య ఫ్లెక్సీ ల గొడవ

- సిట్టింగ్ ఎమ్మెల్యే పేరు,ఫోటో లేని బ్యానర్ లను చించేసిన బిజెపి కార్యకర్తలు



**శ్యాం ప్రసాద్ గట్టాడి, ఆర్మూర్ ప్రతినిధి కరపత్రం**
ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే ఫోటో లేకపోవడంతో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య గురువారం వాగ్వాదం జరిగింది.ఎమ్మెల్యే వచ్చినప్పుడు అధికారులు రావాలంటూ అధికార ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేసారు.ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సమక్షంలోనే కార్యకర్తలు మధ్య దుర్భాషలాట జరగగా బీజేపీ కార్యకర్తలు ఫ్లెక్సీలను చింపేసారు.

## ఇన్ స్టా రీల్స్‌కు అలవాటు పడ్డారా ! అయితే చిట్కాలివే!

**- రామ్ సంకుల, రీసర్చ్ అనలిస్ట్**



**అశ్వారావుపేట,ఖమ్మం**
నేటి డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరు ఇన్ స్టా రీల్స్ చూస్తూ సమయాన్ని వృథా చేస్తున్నారు.అయితే కొన్ని చిట్కాలు పాటిస్తే ఇలాంటి అలవాట్ల నుంచి బయటికి రావచ్చు.రీల్స్ చూడటానికి సమయ పరిమితిని నిర్ణయించుకోవాలి. ఫోన్‌లో నోటిఫికేషన్లు ఆఫ్ చేయాలి.ఖాళీ సమయంలో పుస్తకాలు చదవడం, పాటలు వినడం, డ్రాయింగ్, ఆటలు ఆడడం వంటి హాబీలను అలవాటు చేసుకోవాలి. మొబైల్ డేటాను ఎప్పుడూ ఆన్‌లో పెట్టకుండా, అవసరమైనప్పుడు మాత్రమే ఫోన్ వాడాలి.

## కుప్పకూలిన అనురాగ్ వర్సిటీ స్లాబ్





**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా పోచారం పరిధిలోని వెంకటాపూర్ వద్ద ఉన్న అనురాగ్ వర్సిటీలో శనివారం ప్రమాదం చోటుచేసుకుంది.నిర్మాణంలో ఉన్న భవనంలో స్లాబ్ అకస్మాత్తుగా కూలిపోవడంతో నలుగురు కార్మికులు గాయపడ్డారు.వీరిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.ప్రమాద సమయంలో వారు అక్కడే పని చేస్తున్నారు.సంఘటనపై విచారణ కొనసాగుతోంది.

## మేడ్చల్ లో అయ్యప్ప ఆలయంలో చోరీ



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
అయ్యప్ప ఆలయంలో చోరీ జరిగిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.స్థానికుల వివరాలు ప్రకారం మేడ్చల్ పట్టణం పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ లో ఉన్న అయ్యప్ప ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి దుండగులు ఆలయంలోకి చొరబడి చోరీ చేశారు.ఆలయంలోని ఉన్న చేమలు, ఒక ముక్కంటితో పాటు ఆలయ హుండీ దొంగతనానికి పాల్పడ్డారని స్థానికులు తెలిపారు.సంఘటన స్థలానికి మేడ్చల్ పోలీసులు చేరుకొని క్లూస్ టీం సాయంతో ఆధారాలను సేకరిస్తున్నారు.మేడ్చల్ లో ఈ మధ్య నేరాల సంఖ్య పెరిగిపోయిందని,హత్యలు,రేపులు, దొంగతనాలు,డ్రగ్స్ అమ్మకాలు ఎక్కువ అయ్యాయన్న విషయం వాస్తవం.శాంతి భద్రతలు కాపాడడంలో పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారని కూడా ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.కానీ రాజకీయ నాయకుల ప్రయోజనాలు నెరవేర్చాలని పోలీసులపై తీవ్ర ఒత్తిడి జరుగుతున్నదని తెలిసింది.ఈ ఒత్తిడి వల్ల మేడ్చల్ పోలీసులు తమ విధుల నిర్వహణలో తగిన శ్రద్ధ పెట్టే అవకాశం చిక్కడం లేదని అందరూ భావిస్తున్నారు.ప్రశాంత మేడ్చల్ కొరకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని, డబిల్ పూర్ PACCS చైర్మన్ శ్రీ సద్ది సురేష్ రెడ్డి ఒక ప్రకటనలో అన్నారు.

## బాల్కనీలో నుంచి పడి వ్యక్తి మృతి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
బాల్కనీలో కూర్చుని అదుపుతప్పి కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన షామీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూముకుంట మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ లో షేక్ ఫరీద్ (36) నివాసం ఉంటున్నాడు.వృత్తిరీత్యా లేబర్ పని చేస్తూ జీవనం సాగించేవాడు. శుక్రవారం సాయంత్రం డబుల్ బెడ్ రూమ్ లోని 169 ఫ్లాట్ బాల్కనీలో కూర్చొని ఉండగా అదుపు తప్పి షేక్ ఫరీద్ కింద పడి మృతి చెందాడు.సంఘటన స్థలానికి షామీర్ పేట్ పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆడపిల్లల భద్రతపై కోరుట్లలో సఖి టీం అవగాహన



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల టౌన్**
కోరుట్ల సరస్వతి శిశు మందిర్ లో శనివారం జగిత్యాల సఖి టీం ఆడపిల్లల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.సఖి టీం సిఏ లావణ్య బృందం హైస్కూలు విద్యార్థులకు ఫోక్సో చట్టం విశిష్టతను వివరించారు.ఫోక్సో చట్టం వలన చెడు మార్గంలో పయనించేవారు జైలుకు వెళ్ళక తప్పదన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపు వెంకటేష్ పాల్గొన్నారు.

## కల్తీ కల్లు బాధితుల్లో పెరుగుతున్న కిడ్నీ బాధితులు

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్,జులై 12:**
కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితులకు వైద్యం కొనసాగుతోంది. కల్తీ కల్లు బారిన పడిన వారిలో 33 మంది నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిలో కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే కిడ్నీ పనిచేయని బాధితుల సంఖ్య తొమ్మిది మందికి చేరింది. ఇప్పుడు తాజాగా మరో ఇద్దరు బాధితులకు కూడా డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో 11 మంది ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు- వైద్యులు తెలిపారు. ఇంకో 12 మందిని అబ్జర్వేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు డాక్టర్లు.మరో 19 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ కల్తీ కల్లు ఘటనలో ఇప్పటి వరకు తొమ్మిది మంది మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఇక కల్తీ కల్లు ఘటనలో ప్రధాన నిందితుడు కూన సత్యం గౌడ్‌ను కూకట్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన కుమారులు రవితేజ గౌడ్, సాయితేజ గౌడ్‌ను ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. కూన సత్యం గౌడ్ అరెస్ట్‌తో నిందితుల సంఖ్య ఐదుకు చేరింది.

## ఆర్జీ 1 ఏరియా జిఎం కార్యాలయంలో త్వరలో క్రెచ్ సెంటర్



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి గోదావరిఖని జూలై 12:**
ఆర్జీ 1 ఏరియా జిఎం కార్యాలయం నందు ఆర్జీ 1 ఏరియా జిఎం డి.లలిత్ కుమార్ ఆదేశాల మేరకు మహిళా ఉద్యోగుల పిల్లల కోసం క్రెచ్ సెంటర్ (చిన్నారుల సంరక్షణ కేంద్రం) ఏర్పాటు చేస్తున్న సందర్భంగా శనివారం ఇందుకు సంబందించిన ఏర్పాట్లను, ఇతర పనులను అధికారులు పరిశీలించారు. జిఎం కార్యాలయం నందు పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల చిన్నారుల గురించి బెంగ అక్కర్లేకుండా ఉద్యోగం చేసే మహిళలు పిల్లల ఆలనాపాలనా చూసుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారని యాజమాన్యం గుర్తించి, పని ప్రదేశాల్లో క్రెచ్ సెంటర్ (చిన్నారుల సంరక్షణ కేంద్రం) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఉద్యోగ బాధ్యతలు నిర్వహణ విషయంలో పురుషులతో పోలిస్తే మహిళకు కొన్ని సవాళ్లు ఎదురవుతాయి. ఇంటి బాధ్యతలు చూసుకోవాలి. పిల్లల ఆలనాపాలనా వారి మీదనే ఉంటుంది. వీటన్నింటిని చూసుకుంటూనే ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. పిల్లలు కాస్త పెద్దవాళ్లు అయితే పర్లేదు కానీ. నెలల పిల్లలు ఉన్న తల్లులకు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం కత్తి మీద సాము లాంటిదే. ఇంట్లో పిల్లలను చూసుకునే వారు ఉంటే పర్లేదు. లేదంటే ఉద్యోగం మానేయాల్సిన పరిస్థితి తలెత్తుంది. ఈ సమస్యను పరిష్కరించడం కోసం సింగరేణి సంస్థ ఆర్జీ 1 ఏరియా యాజమాన్యం ఇట్టి క్రెచ్ సెంటర్ (చిన్నారుల సంరక్షణ కేంద్రం) ఏర్పాటు చేయటం మహిళా ఉద్యోగులకు ఒక గొప్ప వరం లాంటిది. త్వరలో సంరక్షణ కేంద్రం పనులు పూర్తి చేసుకొని జిఎం చేతుల మీదుగా ప్రారంభించుకోవటం జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబదించిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ 1 యస్.ఓ.టు జియం ఆంజనేయ ప్రసాద్, డిజీ.ఎం ఫారెస్ట్ బానోతు కర్ణ, డిజీ.ఎం సివిల్ వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మెల్ ఇంగ్లీష్ స్కూల్‌లో తైక్వాండో డెమో: చైర్మన్ వి. రమేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ వి స్వప్న చేతుల మీదుగా బెల్ట్ ప్రదానం




**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మల్కాజిగిరి మండల ప్రతినిధి**
గబ్బిలాల్‌పేట్ కార్మెల్ ఇంగ్లీష్ స్కూల్‌లో రాన్వీర్ తైక్వాండో అకాడమీ మాస్టర్ రమేష్, పాఠశాల విద్యార్థి బి. నిరంత్ కుమార్ కోసం ప్రత్యేకంగా తైక్వాండో డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిరంత్ కుమార్ తన అద్భుతమైన తైక్వాండో నైపుణ్యాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.అనంతరం, మాస్టర్ రమేష్, కార్మెల్ ఇంగ్లీష్ స్కూల్ చైర్మన్ వి. రమేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ వి. స్వప్న చేతుల మీదుగా నిరంత్ కుమార్ (బి. కృష్ణ కుమారుడు) తన గ్రీన్ వన్ బెల్ట్‌ను అందుకున్నారు.ఈ సందర్భంగా చైర్మన్ వి. రమేష్ రెడ్డి మాట్లాడుతూ, నిరంత్ కుమార్ ప్రదర్శించిన నైపుణ్యాలను, మాస్టర్ రమేష్ శిక్షణను ఎంతగానో ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని అన్నారు.ప్రిన్సిపాల్ వి. స్వప్న కూడా నిరంత్ ప్రతిభను కొనియాడారు. ముఖ్యంగా, ప్రస్తుత సమాజంలో అమ్మాయిలకు తైక్వాండో వంటి స్వీయరక్షణ పద్ధతులు ఎంత అవసరమో ఆమె నొక్కిచెప్పారు. ఇది వారిని మరింత ధైర్యవంతులుగా, సురక్షితంగా ఉండేలా చేస్తుందని తెలిపారు.నిరంత్ తండ్రి మరియు పాఠశాల గణిత ఉపాధ్యాయుడు అయిన బి. కృష్ణ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కార్మెల్ ఇంగ్లీష్ స్కూల్ విద్యార్థులలో తైక్వాండో పట్ల ఆసక్తిని, స్వీయరక్షణ నైపుణ్యాలను పెంపొందించింది.

## బిసి రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చించాలి

- భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్,జులై 12**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చూస్తుంటే బీసీలను మోసం చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆర్డినెన్సు తీసుకురాకుండానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసినట్లు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇందులో సాధ్యాసాధ్యాలను పరిశీలించడం లేదని అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎప్పుడూ ఇచ్చిన మాట మీద నిలబడలేదన్నారు. బీసీ రిజర్వేషన్లకు మతపరమైన అంశాన్ని జోడించారు. మతపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం, సుప్రీం కోర్టు అంగీకరించవు. శాసనసభ సమావేశాలు ఏర్పాటు- చేసి.. బీసీ రిజర్వేషన్ ఏ విధంగా అమలుచేస్తారో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా.. బీసీలకు అన్యాయం జరగకుండా.. ఇచ్చిన మాటకు కట్టు-బడి ఉండాలని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం జూలై 13 2025



# ఉద్యోగ పదవీ విరమణ పొందిన మల్లారెడ్డిని సన్మానించిన ప్రణవ్.

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ జులై 12**

ఇటీవల ఉద్యోగ పదవి విరమణ పొందిన కటుకూరి మల్లారెడ్డిని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లి ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమని,విద్యా,సంక్షేమం,మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థలో 1992 లో ఉద్యోగంలో చేరిన మల్లా రెడ్డి అసిస్టెంట్ ఇంజనీర్ గా హుజురాబాద్ ప్రాంతంలో 30 ఏళ్ళ పాటు విధులు నిర్వర్తించారన్నారు. డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పదోన్నతి పొంది సిరిసిల్ల,జగిత్యాల సబ్ డివిజన్లో పని చేసి జూన్ 30 న పదవి విరమణ పొందారన్నారు. జర్నలిజంపై ఉన్న మక్కువతో అంతకుముందు కొన్నేళ్లపాటు రిపోర్టర్ గా పని చేసి వార్త మల్లన్న గా ఈ ప్రాంతానికి సుపరిచితుడయ్యారని,విరమణ తర్వాత కూడా ఆయన సమాజానికి సేవ చేయాలని అన్నారు.

# అట్టహాసంగా ఆల్ ఇండియా చెస్ పోటీలు ప్రారంభం....







- 600 మందికి పైగా క్రీడాకారులు హాజరు
- పోటీలను ప్రారంభించిన డివైఎస్ఓ, ఒలంపిక్, ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు
- తొలిరోజు ముగిసిన నాలుగు రౌండ్ల పోటీలు

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

కరీంనగర్ వేదికగా జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో డెమొక్రటిక్ చెస్ ఫెడరేషన్ సహకారంతో కరీంనగర్ లోని వీ కన్వెన్షన్ లో శనివారం 3వ ఆల్ ఇండియా జూనియర్, ఓపెన్ చెస్ చాంపియన్షిప్ 2025 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 600 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. హాజరైన క్రీడాకారులకు స్విస్ లీగ్ పద్ధతిలో 8 రౌండ్ల వరకు పోటీలను నిర్వాహకులు ఏర్పాటు చేయగా తొలి రోజున నాలుగు రౌండ్ల వరకు పోటీలను నిర్వహించారు. అంతకుముందు ఈ పోటీలను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి బి శ్రీనివాస్ గౌడ్, ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్ రెడ్డి, సంగం లక్ష్మణ్ , తెలంగాణ ఒలంపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి లు హాజరై జ్యోతి ప్రద్యులను చేసి తొలి ఎత్తును వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ అంటేనే క్రీడా పోటీల నిర్వహణకు, క్రీడాకారులకు నిలయం అని అన్నారు. జాతీయస్థాయి చెస్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా ఉందని పోటీలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ఈ సందర్భంగా వారు అభినందించారు. చదరంగం క్రీడ విద్యార్థుల మెదస్సుకు పదను పెడుతుందన్నారు. చెస్ లో రాణించిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారు అన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులందరూ విశ్వనాథన్ ఆనంద్, గుకేష్, ప్రజ్ఞానంద్, అర్జున్ ఎరగేసి, కోనేరు హంపి లాంటి మహోన్నత వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలని సూచించారు. పోటీల నిర్వాహకులు జీనియస్ అకాడమీ డైరెక్టర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో కరీంనగర్ లో మూడవసారి ఆల్ ఇండియా స్థాయిలో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో చెస్ క్రీడకు క్రేజీ తెచ్చేందుకే ప్రతి సంవత్సరం పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సుమారు లక్ష రూపాయల పైగా నగదు పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, కోఆర్డినేటర్ సృజన్ కుమార్, చీఫ్ ఆర్బిటర్ బొల్లం సంపత్, ఉష టేబుల్ టెన్నిస్ క్రీడా సంఘాల కార్యదర్శులు భార విద్యాసాగర్, దారం గౌతమ్ రెడ్డి, జిల్లా ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ గౌడ్ లతోపాటు నూనె సాయి కృష్ణ, తాటిపల్లి సతీష్ బాబు, క్రీడాకారులు, తల్లిదండ్రులు , పీ ఈ టీ లు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు కాంగ్రెస్ ఘరానా మోసం

- ఓట్లు దండుకునేందుకే బి.సీ.ల రిజర్వేషన్ల నాటకం
- రాష్ట్రంలో ఆర్డినెన్స్ డ్రామా అడుతున్న కాంగ్రెస్ సర్కార్
- రామగుండం మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

రాష్ట్రంలో బీసీల మనోభావాలు దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ సర్కారు వ్యవహరిస్తుంది... వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం కోసం ఆర్డినెన్సు తీసుకువస్తున్నట్టు ప్రకటించిన కాంగ్రెస్ సర్కారు వ్యవహార శైలిపై పలు అను మానాలు కలుగుతున్నాయని, ఇందులో ద్రోహంతో కూడిన కుట్ర కనిపిస్తున్నదని... వచ్చే ఎన్నికల్లో బీసీల ఓట్లు కొల్లగొ ట్టేందుకే ఈ రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చా రని రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ గారు అన్నారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల



ఓట్లను దండుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం మళ్ళీ బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ పై ఆర్డినెన్స్ నాటకం మొదలు పెట్టిందనీ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని వెల్లడించి, 20 నెలలు కాలయాపన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రప్రభుత్వానికి, రాష్ట్రపతి ఆమోదానికి పంపడం జరిగిందని, ఇప్పుడు కొత్తగా ఆర్డినెన్స్ పేరుతో మరో మోసానికి తెరలేపిందని ఆరోపించారు. గతంలో మహారాష్ట్ర,బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్ పెంచాలని చూస్తే కోర్టులు కొట్టివేసిన విషయం ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, జాతీయస్థాయిలో ప్రతిపక్ష హెూ దాలో ఉన్న అయినప్పటికీ బీసీ బిల్లు విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసు కురాలేదని విమర్శించారు. అన్నీ తెలిసి కూడా బీసీలకు ద్రోహంచేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఖండిస్తున్నామన్నారు. 42శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే కాంగ్రెస్ సర్కారు ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల విష యంలో ఈ సర్కార్ ఘరానా మోసానికి పాల్పడుతుంది. అసెంబ్లీలో పెట్టిన బీసీ బిల్లులను గవర్నర్ ద్వారా ఢిల్లీకి పంపారని, ప్రస్తుతం అది కేంద్రం వద్ద ఉన్నదని, ఈ నేపథ్యంలో ఇప్పుడు దానిని కాదని, ఆర్డినెన్స్ తీసుకురావ డమేమిటని ప్రశ్నించారు. గతంలో మహారాష్ట్ర, తమిళనాడు, బీహార్ రాష్ట్రాల్లో కూడా ఇలాగే జీవో జారీ చేస్తే అవి కోర్టుల్లో నిలబడలేదని గుర్తు చేశారు. చట్టబద్ధత లేని కులగణన జరిపిన కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన చెల్లదని కేంద్రప్రభుత్వం కూడా తెలుపడం జరిగిందని, అయినా ఇంకా బీసీ లను మోసం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి బీసీలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ విలేఖరుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు,బొడ్డు రవీందర్, నారాయణదాసు మారుతి, కల్వచర్ల కృష్ణవేణి, బాదే అంజలి, గాదం విజయ, పిల్లి రమేష్, జిట్టవేన ప్రశాంత్, గుంపుల లక్ష్మి, నూతి తిరుపతి, బుర్ర వెంకటేష్ కొడి రామకృష్ణ సత్యప్రసాద్, నీరటి శ్రీనివాస్, తోకల రమేష్,సట్టు శ్రీనివాస్ కుమార్ నాయక్, ముక్కెర మొగిలిగుర్రం పద్మ గౌడ్, సారయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి..

- ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- ట్రాఫిక్ రూల్స్ పాటించాలి..
- ఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూలై 12:**
అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంగనగర్ లో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో గంగా నగర్ లోని ప్రతి ఒక్క ఇంటిని తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకన్నారు. దొంగతనాలపై, గంజాయి, డ్రగ్స్, సైబర్ క్రైమ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మీ మీ ఇండ్లలోకి ఎవరైనా కిరాయికు వస్తే వారి పూర్తి వివరాలు, గతంలో ఎక్కడ నుండి వచ్చారని, ఆధార్ వివరాలు, వారి కుటుంబ సభ్యుల, ఉద్యోగ వివరాలు తప్పనిసరిగా తెలుసుకోవాలి అని సూచించారు. మీ కాలనీ ప్రాంతంలో అనుమానస్పదంగా ఎవరైనా వ్యక్తులు కనిపించినట్లయితే తప్పనిసరిగా అడగాలని, పగటి సమయంలో బట్టలు, బేడీషీట్స్, బొల్లు, ఇతర సామానులు కొంటాం అమ్ముతామని కొంతమంది ఇతర ప్రాంతాల, రాష్ట్రాల నుండి వచ్చి పరిసరాలను, తాళం వేసి ఉన్న ఇండ్లను గమనించి రాత్రి పూట దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రజలు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలి. స్వీయ రక్షణ కోసం ప్రతి ఒక్కరు ప్రతి ఇంటికి రెండు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్, రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని, తమ తమ వాహనాలకు అన్ని ధ్రువీకరణ పత్రాలను ఉంచుకోవాలని, ముఖ్యంగా యువత రేషన్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్ చేయడం, లైసెన్స్ లేక లేకుండా డ్రైవింగ్ చేయడం మైనర్ డ్రైవింగ్ చేయడం చేస్తు ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలకు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని, వారి వలన ప్రమాదం జరిగి ఎవరికైనా ఇబ్బంది కలిగితే బైక్ యజమానులపై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ భూమేష్, అనూష, స్పెషల్ పార్టీ సిబ్బంది, స్థానిక ప్రజలు యువత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూలై 12**
హుజూరాబాద్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పంజాల అరవింద్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం మంత్రి పొన్నం ప్రభాకర్ కి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి ఏమ్మెల్సీ బల్మూర్ వెంకట్ కి ప్రత్యేక కృతజ్ఞతలు దేశ చరిత్రలోనే ఇప్పటి వరకు ఏ రాష్ట్రం తీసుకొని చరిత్రాత్మక ప్రతిష్టాత్మక నిర్ణయం బీసీలకు బడుగు బలహీన వర్గాలకు రాజకీయ పరంగా విద్య ఉద్యోగ పరంగా 42 శాతం రిజర్వేషన్ అమలుచేసినటువంటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి బీసీలకి వెన్నుదన్నుగా ఉంటూ బీసీ వర్గాల నుండి ఎంతో మందిని కార్యకర్త స్థాయి నుండి ప్రజాప్రతినిధులుగా తీర్చి దిద్దినటువంటి ఏమ్మెల్సీ బల్మూర్ వెంకట్ చిత్ర పటానికి హుజురాబాద్ నియోజకవర్గంలోని స్థానిక



హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పాలాభిషేకం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చిన్నాల శ్రీకాంత్,నియోజకవర్గ కార్యదర్శి ఉమ్మడి సందీప్ కమలాపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడ శ్రీకాంత్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు రంజిత్ రెడ్డి కమలాపూర్ మండల



ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు బొంకూరి కుమార్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కుమ్మరి ప్రశాంత్ వీణవంక మండల ఎన్ ఎస్ యు ఐఅధ్యక్షులు కాటిపల్లి అజయ్ హుజురాబాద్ పట్టణ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు మోరే అజయ్ నియోజకవర్గ కార్యదర్శి మునిగంటి రాకేష్ మాట్ల రాజేష్ శనిగరపు దినేశ్ సంపత్ తదితరులు పాల్గొన్నారు

# బోనాల చెక్కుల పంపిణీలో ఉద్రిక్తత

- కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్,జులై 12:**
సికింద్రాబాద్‌లో బోనాల చెక్కుల పంపిణీలో ఉద్రిక్తత చోటు- చేసుకుంది. ప్రోటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటు- చేసుకుంది. సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ముందే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పోటా పోటీ నినాదాలు చేశారు. చెక్కులు పంపిణీ చేస్తుండగా బీఆర్ఎస్ నేతలు స్టేజ్‌పై కరెంట్ కట్ చేశారు . బీఆర్ఎస్ నేతల తీరుపై వేం నరేందర్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. తప్రోటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ప్రోటోకాల్ పేరుతో ఎమ్మెల్యే పద్మారావు వివాదం సృష్టిస్తున్నారంటూ డిప్యూటీ- మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పద్మారావు, కాంగ్రెస్ ఇంఛార్జ్ సంతోష్ అనుచరుల మధ్య వాగ్వాదం చోటు- చేసుకుంది. పరస్పరం నినాదాలు చేసుకున్నారు. దీంతో సికింద్రాబాద్ కట్టమైసమ్మకు సంబంధించిన బోనాలు వేడుక చెక్కుల పంపిణీ వివాదాస్పదంగా మారింది. ప్రోటోకాల్ ప్రకారం అన్నీ జరిగాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ప్రోటోకాల్ కోసమే తప్ప ఎమ్మెల్యే అసలు తమకు అందుబాటు-లో ఉండటం లేదంటూ హస్తం నేతలు ఆందోళనకు దిగారు. తీవ్ర గందరగోళం నెలకొనడంతో వెంటనే పోలీసులు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలను చెదరగొట్టారు.

# కోల్‌కతాలో మరో దారుణం

# ఐఐఎం విద్యార్థినిపై అత్యాచరాం

**కరపత్రం ప్రతినిధి కోల్‌కతా,జులై 12 :**

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. రోజుకో ఘటన వెలుగులోకి వస్తుంది. కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెనేజ్‌మెంట్ చదువుతున్న విద్యార్థినిపై మరో విద్యార్థి అత్యాచారం చేశాడు. ఓ విద్యార్థిని మానసికంగా కృంగిపోవడంతో ఆమె స్నేహితుడు కౌన్సిలింగ్ ఇస్తానని రమ్మని కబురు పంపాడు. విద్యార్థిని బాయ్స్ హాస్టల్‌కు వెళ్లిన తరువాత మత్తు మందు కలిపిన కూల్ డ్రింక్ ఆమెకు స్నేహితుడు ఇచ్చాడు. ఆమె స్పృహ కోల్పోయిన తరువాత ఆమెపై అతడు అత్యాచారం చేశారు. ఆమెకు స్పృహ వచ్చిన తరువాత తనపై అఘాయిత్యం జరిగిందని తెలుసుకొని అతడిని ప్రశ్నించింది. ఈ విషయం బయట చెబితే చంపేస్తానని బెదిరించాడు. వెంటనే ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోల్‌కతాలోని ఓ జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. నెల రోజుల క్రితం న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన విషయం విదితమే.